



వారం రోజుల్లో ట్రస్ట్ బోర్డు: ఎమ్మెల్యే బొజ్జల

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

నామినేటెడ్ పదవుల్లో కూటమినేతలకు సమన్యాయం జరుగుతుందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి హామీ ఇచ్చారు. వారం రోజుల్లో ముక్కంటి ట్రస్ట్ బోర్డును ప్రకటించనున్నట్లు వెల్లడించారు. ధనుర్మాసం సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి బుధవారం కుటుంబ సమేతంగా స్వామీ అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముక్కంటి ట్రస్ట్ బోర్డ్ నియామకానికి ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలిపారు. బోర్డులో ఎవరెవరికి అవకాశం దక్కుతుందనేది బాబు చేతుల్లో ఉందన్నారు. అయితే కూటమిలో భాగస్వాములైన బిజెపి, జనసేన పార్టీలకు పదవుల్లో ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు.

విశ్వోదయా.. ఇదేందయ్యా..!



● తప్పులతడకతో విద్యార్థుల సర్టిఫికెట్లు ● కలెక్టర్ చెంతకు ల్యాబ్‌టెక్నీషియన్లు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ప్రభుత్వ కాలేజీ యాజమాన్యం చేసిన తప్పులకు వందమంది విద్యార్థుల భవిష్యత్ అగమ్యగోచరంగా మారింది. బ్యాచ్‌లర్ ఆఫ్ సైన్స్ ల్యాబ్ టెక్నీషియన్ విద్యార్థులకు ప్రొవిజినల్స్‌లో బిఎస్‌సి ఎంఎల్‌టి అని ఉంది. అయితే మార్కుల లిస్టులో బిఎస్‌సి వొకేషనల్ ఎంఎల్‌టి అని సర్టిఫికెట్ కోర్సుగా తప్పుల తడకతో ఇచ్చారు. దీంతో మూడేళ్లపాటు చదివిన విద్యార్థులు లబోదిబోమంటున్నారు. స్విమ్స్‌లో ఆరు నెలల పాటు ఇంటెన్షిప్ చేసినప్పటికీ సర్టిఫికెట్లు జారీ కాలేదు. దీంతో ఆ వందమంది విద్యార్థులు కలెక్టర్‌ను ఆశ్రయించారు. వివరాల్లోకి వెళితే...

తిరుపతి జిల్లా వెంకటగిరికి చెందిన విశ్వోదయ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో 24 మంది విద్యార్థులు మూడేళ్ల క్రితం బ్యాచ్‌లర్ ఆఫ్ బిఎస్‌సి, బ్యాచ్‌లర్ ఆఫ్ సైన్స్, మెడికల్ ల్యాబ్ టెక్నికల్ కోర్సుల్లోచేరారు. అయితే వీరికి ప్రొవిజినల్స్‌లో బ్యాచ్‌లర్ ఆఫ్ సైన్స్ ఎంఎల్‌టి అని ఉంది. అయితే మార్కుల లిస్టులో బ్యాచ్‌లర్ ఆఫ్ సైన్స్ వొకేషనల్‌గా ఇచ్చారు. మూడేళ్లపాటు కాలేజీకి వెళ్లి చదివిన వీరికి, ఆర్నెల్ల సర్టిఫికెట్ కోర్సుగా మార్కుల లిస్టులో ఇవ్వడంతో వీరి భవితవ్యం ప్రశ్నార్థకమయ్యింది. అలాగే స్విమ్స్‌లో ఆర్నెల్లపాటు ఇంటెన్షిప్ చేసినప్పటికీ సింహపురి యూనివర్సిటీకి చెందిన ఈ కాలేజీ సర్టిఫికెట్లను ఇప్పించలేకపోయింది. మొదటి బ్యాచ్ 24 మంది, రెండో బ్యాచ్ 26మంది, మూడో బ్యాచ్ 30 మంది ఉన్నారు. మూడేళ్ల కోర్సు అయినట్లుగా ఇస్తే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ల్యాబ్ టెక్నీషియన్లుగా అవకాశం ఉంటుంది. వొకేషనల్‌గా ఇవ్వడం వల్ల కార్పొరేట్ ఆస్పత్రుల్లో అసిస్టెంట్‌లుగానే ఉంటారు. తమ భవితవ్యం ఏమిటోనని గ్రీవెన్స్‌సెల్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సీరియస్ అయిన జిల్లా కలెక్టర్ కాలేజీ యాజమాన్యంతో మాట్లాడి తక్షణమే మార్కుల లిస్టును సరిదిద్ది ఇవ్వాలని, పిల్లల జీవితాలతో ఆడుకోవద్దని ఆదేశించారు.

చెప్పినా పట్టించుకోలేదు : కార్తికేయ, ఫైనలియర్



మాకు ప్రొవిజినల్‌లో ఒకలా, మార్కుల లిస్టులో మరోలా ఇచ్చారని, ఈ సర్టిఫికెట్ ఇలా ఇవ్వడం వల్ల ఎందుకూ పనికిరాదని, మూడేళ్లు చదివినా ఆర్నెల్లకిందకే వస్తుందని అనేకమార్లు కాలేజీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లాం. మా కాలేజీ సింహపురి యూనివర్సిటీకి అనుసంధానం కావడంతో అక్కడకు వెళ్లి వేడుకొన్నాం. న్యాయం జరగలేదు. అందుకే కలెక్టర్‌ను కలిసి న్యాయం చేయాలని అడిగేందుకు వచ్చాం.

గిరిజనులకు పట్టాలు ఇవ్వండి : సిపిఎం

ప్రజాశక్తి - దొరవారిసత్రం, యంత్రాంగం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో అయినా గిరిజనులకు డికెటి పట్టాలు మంజూరు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. దొరవారిసత్రం మండలం తనియాలి గిరిజన కాలనీలో సమావేశం జరిగింది. అనేక సంవత్సరాలుగా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నప్పటికీ గిరిజనులకు పట్టాలు ఇవ్వకుండా వివక్ష చూపుతున్నారన్నారు. ఈనెల 28వ తేదీ సచివాలయం వద్ద అర్జీలతో నిరసన తెలియజేస్తామని గిరిజనులు ఏకగ్రీవంగా తీర్మానించుకున్నారు. కాలనీవాసులతో కలిసి భూములను పరిశీలించారు. కొందరు ఎస్సీలకు భూములు లేకపోగా, పెత్తందారులు గేటు ఏర్పాటు చేసుకుని ఆటంకం కలిగించడాన్ని పరిశీలించారు. గేటును తొలగించి దళితులు వెళ్లేందుకు దారి కల్పించాలన్నారు. లేనిచో దళితులందరినీ సమీకరించి గేటును తొలగించాల్సి ఉంటుందని హెచ్చరించారు. గతంలో రెవెన్యూ అధికారులు పరిశీలించినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ పర్యటనలో నాయకులు మునయ్య, బత్తయ్య, మునస్వామి పాల్గొన్నారు.

– కోటలో జరిగిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని తహశీల్దార్ కటారి జయజయరావు అన్నారు. గురువారం మండలంలోని వంజివాక గ్రామంలో జరిగింది. డిప్యూటీ తహశీల్దార్ పఠాన్ అజ్మతుల్లాఖాన్, ఆర్ఐ మధులత పాల్గొన్నారు.

– రామచంద్రాపురం మండలంలో నడవలూరు, కమ్మకండ్రిగ గ్రామాల్లో తహశీల్దార్ కె.వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగింది. టిడిపి సీనియర్ నాయకులు జనార్ధన్ చౌదరి పాల్గొన్నారు.

– రెవెన్యూ సదస్సుల్లో ఇచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి పి.హేమలత డిమాండ్‌చేశారు. తాము రెండు మూడు రెవెన్యూ సదస్సుల్లో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే అప్పటికప్పుడు ఒక్క సమస్య కూడా పరిష్కారం చూపడం లేదన్నారు. అర్జీలు తీసుకోవడమే తప్ప సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. దీనివల్ల ఏం ప్రయోజనమని ప్రశ్నించారు. నెన్నూరు గ్రామంలో రవిప్రసాద్ 2006లో భూమి కొన్నాడని, 35 ఏళ్లుగా అనుభవంలో ఉన్నప్పటికీ అమ్మిన రోశయ్య మీదనే ఆ 14 సెంట్లు ఉందన్నారు. అనేకమార్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. నడవలూరులో కాల్వ కోసం భూములు ఇచ్చిన రైతులకు ఒక్క రూపాయి కూడా పడలేదన్నారు. గత 20 ఏళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని, సమస్యలను పరిష్కరించకుండా అర్జీలను స్వీకరించడానికేనా రెవెన్యూ సదస్సులని మండిపడ్డారు.

– శ్రీకాళహస్తి రూరల్ ముచ్చువోలు గ్రామంలో రెవెన్యూ సదస్సుకు ఎంఎల్‌ఎ బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి హాజరయ్యారు. పెద్దఎత్తున ఫిర్యాదులను స్వీకరించారు. వైసిపి పాలనలో భూదందాలకు పాల్పడిన ప్రతి ఒక్కరి లెక్క తేలుస్తామని చెప్పారు. టిడిపి నేతలు రంగినేని చెంచయ్య నాయుడు, తాటిపర్తి ఈశ్వర్ రెడ్డి, తహశీల్దార్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



తనియాలి కాలనీ వాసులతో వి.నాగరాజు



పెంచిన కరెంట్ ఛార్జీలు తగ్గించాలి : రైతుసంఘం

ప్రజాశక్తి - పాకాల

పెంచిన కరెంట్ ఛార్జీలు తగ్గించాలని, సర్దుబాటు పేరుతో భారాలు వేయడం మానుకోవాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి పి.హేమలత డిమాండ్ చేశారు. పాకాలలో విద్యుత్ ఛార్జీల భారాలపై నిరసన తెలిపారు. హేమలత మాట్లాడుతూ అసలే నిత్యావసరాల ధరలు పెరిగి జనం ఇబ్బందులు పడుతుంటే మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా విద్యుత్ బిల్లుల భారాలు మోపడం సరికాదన్నారు. ఉచితంగా లభించే సూర్యరశ్మి ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసి, తక్కువ ధరకు అందించాల్సిన ప్రభుత్వం అదానీ ప్రైవేట్ సంస్థకు అప్పగించి, సెకీ ద్వారా అధిక ధరలకు కొనుగోలు చేసిందన్నారు. ఆంధ్రరాష్ట్రంలో గత పాలకులకు రూ.1750 కోట్ల రూపాయలు లంచం రూపంలో ఈ సందర్భంగా ముట్టచెప్పారని అమెరికాలోని ప్రభుత్వ దర్యాప్తు సంస్థ తెలియజేసిందన్నారు. ఈ విషయమై లోక్‌సభ అట్టుడుకుతున్నా, రాష్ట్రంలో టిడిపి నోరు తెరవకపోవడం అన్యాయం అన్నారు. నాయకులు మధుసూదనరావు, సుగుణ, కేశవరెడ్డి, రాజు, లక్ష్మయ్య, నవీన్, దేవేంద్ర పాల్గొన్నారు.



'నమో అదానీ కరెంటు కహానీ' ప్రచారం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

బడా పెట్టుబడిదారుడు అదానీతో గత ప్రభుత్వం చేసుకున్న విద్యుత్ ఒప్పందాలన్నీ రద్దుచేసి, జగన్–అదానీ అవినీతిపై విచారణ జరపాలని సిపిఎం ఏరియా కార్యదర్శి గంధం మణి డిమాండ్ చేశారు. ప్రజలకు నష్టాన్ని చేకూర్చే అదానీ ఒప్పందాన్ని 'నమో అదానీ కరెంట్ కహానీ' పేరిట ప్రచురించిన పుస్తకాలను బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో పట్టణ ప్రజలకు పంచి పెట్టారు. గత ఎన్నికల ప్రచారంలో స్మార్ట్ మీటర్లను పగలగొట్టండని పిలుపునిచ్చిన కూటమి నేతలు, ఇప్పుడు ఎర్ర తివాచీ పరిచి మరీ స్వాగతించడం సిగ్గుచేటు అన్నారు. స్మార్ట్ మీటర్ల కారణంగా పగలు ఒక రేటు, రాత్రి ఎక్కువ రేటు చందాన బిల్లులు చెల్లించాల్సిన ప్రమాదం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. సిపిఎం నాయకులు పెనగడం గురవయ్య, సంక్రాంతి వెంకటయ్య, గురునాథం కుమార్, వెంకటేష్, వెలివేంద్రం పాల్గొన్నారు.

డిపో అధికారి వివక్షపై ఎస్‌డబ్ల్యుఎఫ్ దీక్షలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్

గూడూరు ఆర్టీసీ డిపో పరిధిలో కండక్టర్, డ్రైవర్లను అక్రమంగా సస్పెండ్ చేసిన డిపో అధికారి వివక్షపై ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆధ్వర్యంలో చేస్తున్న రిలేనిరాహార దీక్ష బుధవారం నాటికి ఏడో రోజుకు చేరుకుంది.పి.రవీంద్ర, ఎంఎస్ వాసు దీక్షల్లో కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ రాము, డి.శ్రీధర్, వై.సుధాకర్, రాజు, ఎం.శేషయ్య, పి.రమణయ్య, ఎం.గురవయ్య, సిఐటియు నాయకులు పి.శ్రీనివాసులు, బివి రమణయ్య, బి.చంద్రయ్య, గుర్రం రమణయ్య పాల్గొన్నారు..



కాలినడక... భయం లేదిక..!

సోలార్ బేస్డ్ లైన్‌ట్రాప్ కెమెరాలు
24x7 అటవీ సిబ్బందికి అలర్ట్స్
శ్రీవారి భక్తుల భద్రతకు చర్యలు



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

శేషాచలం అడవులలో భాగమైన తిరుమల కాలినడక మార్గంలో వన్యప్రాణుల నుండి శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తుల భద్రత కోసం అటవీ శాఖ నూతన ఆలోచనకు కార్యరూపం తీసుకొచ్చింది. కాలినడక మార్గంలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో సోలార్ బేస్డ్ లైన్ ట్రాప్ కెమెరాలు అమర్చి కాలినడక మార్గం సమీపంలో ఏదేని వన్యప్రాణి కనిపిస్తే వెంటనే సమీప సిబ్బందికి అలర్ట్ సమాచారం అందిస్తూ భక్తుల భద్రతకు సాంకేతికతను జోడించింది. ఇది తప్పనిసరిగా ఫలితాలను ఇస్తోందని శ్రీ వెంకటేశ్వర నేషనల్ పార్క్ రేంజి ఎఫ్ఆర్వో సుదర్శన్ రెడ్డి 'ప్రజాశక్తి'కి తెలిపారు. కాలినడక మార్గంలో రాత్రిపూట మెట్ల మార్గం గుండా తిరుమలకు వెళ్లే భక్తులను గుంపులు గుంపులుగా ఒక పాయింట్ నుండి ఇంకొక పాయింట్ వరకు సురక్షితంగా తరలించడానికి అటవీశాఖ, టీటీడీ ఫారెస్ట్ విభాగం, టీటీడీ విజిలెన్స్ సిబ్బంది ఒక్కో విభాగానికి పదిమందిగా రాత్రిపూట కాలినడక మార్గంలో విధులు నిర్వర్తిస్తున్నారని ఎఫ్ఆర్వో తెలిపారు.



కాలినడక మార్గంలో 200 కెమెరాలు.....

అలిపిరి కాలినడక మార్గం ఏడవ మైలు వద్ద నుండి నరసింహ స్వామి ఆలయం వరకు 200 కెమెరాలను అటవీశాఖ అధికారులు ఏర్పాటు చేయనున్నారు. ఈ లైన్ ట్రాప్ కెమెరా విలువ ఒకటి రూ. 25 వేల రూపాయలు. ఇప్పటికే 60 కెమెరాలను ఏర్పాటు చేసి మెట్ల మార్గంకు సమీపంలో ఏ వన్యప్రాణి వచ్చినా సోలార్ బేస్డ్ లైన్ ట్రాప్ కెమెరాస్ వెంటనే ఆ జంతువు కదలికలను ఏ వైపుకు వెళ్లనుంది, ఏ ప్రాంతంలో సంచరిస్తోంది అన్న విషయాలను 360 డిగ్రీలు చిత్రీకరించే అధునాతన ట్రాప్ కెమెరాను వెంటనే తిరుపతి కపిల తీర్థం వద్ద గల బయో ల్యాబ్ లో ఏర్పాటు చేసిన మోనిటరింగ్ సిస్టంకు, అటవీ శాఖ సిబ్బందికి అలర్ట్ మెసేజ్ ను ఫార్వర్డ్ చేస్తుంది. దీంతో ఆయా పరిధిలో విధుల్లో ఉన్న సిబ్బంది ఆ వన్యప్రాణి కదలికలను గమనిస్తూ భక్తులను అలర్ట్ చేసి వారిని సురక్షితంగా మెట్ల మార్గంలో వెళ్లేలా తగిన చర్యలు తీసుకుంటారు. తద్వారా విధుల్లో ఉండే సిబ్బంది బృందాల మధ్య సమన్వయ ఉంటుంది.

బయో ల్యాబ్ లో ప్రత్యేక సిబ్బంది నియామకం

అలిపిరి కాలినడక మార్గంలో నూతనంగా ఏర్పాటు చేసిన సోలార్ బేస్డ్ లైన్ ట్రాక్ కెమెరాస్ ను అనుసరిస్తూ సిబ్బందికి తగు సూచనలు ఇవ్వడానికి అటవీ శాఖ బయో ల్యాబ్ లో మోనిటరింగ్ సిస్టంను ఏర్పాటు ఏర్పాటు చేశారు . ఇక్కడ 24 గంటలూ కెమెరాలను రికార్డులను పరిశీలించడానికి ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఈ కెమెరాల్లో రికార్డయ్యే వన్యప్రాణుల కదలికలను అటవీశాఖ అధికారులు తమ స్మార్ట్ ఫోన్ నుండి కూడా వీక్షించే విధంగా వసతులు ఏర్పాటు చేసుకున్నారు. జిఎస్‌ఎమ్ సిమ్ ద్వారా ఈ సోలార్ బేస్డ్ లైన్ ట్రాప్ కెమెరాలు పనిచేస్తాయి. కాలినడక మార్గంలో మూడు విభాగాలకు చెందిన సిబ్బంది రాత్రి వేళల్లో భక్తుల భద్రత కోసం పనిచేస్తారని, ఈ మూడు బందాలకు డ్రెస్ కోడ్ ఉంటుందని ఎఫ్ఆర్ఓ సుదర్శన్ రెడ్డి తెలిపారు.

శాశ్వత పరిష్కారం లభించేనా..


అలిపిరి కాలినడక మార్గం ఏడో మైలు వద్ద చిరుతపులుల సంచారం నేపథ్యంలో ఓ బాలికను చిరుత కిరాతకంగా చంపడంతో భక్తుల భద్రతకు సంబంధించి శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులు ఎన్నో సమావేశాలను నిర్వహించారు. కాలినడక మార్గం దట్టమైన అటవీ ప్రాంతంలో అప్పర్ పాస్ వంతెన నిర్మాణానికి మొదట్లో ఆలోచన నిర్ణయాలను ప్రకటించినా నేటికీ వైల్డ్ లైఫ్ అథారిటీ ఆఫ్ ఇండియా వారి వద్ద పరిశీలనలో ఉంది. నూతనంగా అటవీ శాఖ తీసుకున్న సాంకేతికత చర్య భక్తుల భద్రతకు, వన్యప్రాణుల రక్షణకు ఫలితాలను ఇవ్వనుంది. అదేవిధంగా జంతువులు అడవి నుండి దాహార్తి తీర్చుకోవడానికి బయటకు రాకుండా అడవిలోనే నీటి తొట్టెలు, సాసర్ ప్లేట్ లను నిర్మించారు. వీటిలో క్రమంగా నీరు నిల్వ ఉంచగలిగితే వన్యప్రాణులు దట్టమైన అడవి నుండి బయటకు వచ్చే పరిస్థితులు దాదాపు తగ్గిపోతాయన్నది అధికారుల ఆలోచన.

రిసిప్షన్ అధికారుల నిర్లక్ష్యం

రూ.2 కోట్ల ఆదాయం కోల్పోయిన టిటిడి
గదులున్నా కేటాయించని వైనం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానం రిసిప్షన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా టిటిడి నెలరోజుల కాలంలో రూ.2 కోట్ల రూపాయల ఆదాయం కోల్పోయినట్లు అధికారులు లెక్కలు తేల్చారు. గదులు ఖాళీగా ఉన్నా ఖాళీగా ఉంచుతున్నారే తప్ప భక్తులకు కేటాయించలేదన్న విమర్శలున్నాయి. ఆన్‌లైన్‌లో రూములు, దర్శనం బుక్ చేసుకున్న వారు రిసిప్షన్ వద్దకు వచ్చి గది కోసం గంటల తరబడి పడిగాపులు కాయడంతో ఇక దర్శనం సమయం వచ్చింది, కోనేరులో మునిగి శ్రీవారి దర్శనానికి వెళ్లిన భక్తులు వందలాదిమంది ఉన్నారు. ఈ కారణంగా గదులను అద్దెకు తీసుకోకపోవడం వల్ల టిటిడి దాదాపు 2 కోట్ల రూపాయల ఆదాయం కోల్పోయినట్లు అదనపు ఈవో వెంకయ్యచౌదరికి సమాచారం అందడంతో హుటాహుటిన రిసిప్షన్ డిప్యూటీ 1, రిసిప్షన్ డిప్యూటీ 2తో పాటు రిసిప్షన్‌లో విభాగంలో పనిచేసే సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి, సీరియస్‌గా హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం. వారానికో తుపాను రావడం, చలికాలం కావడం వల్ల తిరుమలలో భక్తులు చలికి వణికిపోయే పరిస్థితి. గదుల కోసం పిల్లాజెల్లతో గంటల తరబడి నిరీక్షించలేక ఈస్టు గోదావరి జిల్లాకు చెందిన రమేష్ అనే భక్తుడు సహనం కోల్పోయి ఉన్నతాధికారులపై విరుచుకుపడినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే రిసిప్షన్ అధికారుల నిర్లక్ష్యం వెలుగులోకి వచ్చింది. వెంకయ్య చౌదరి జోక్యం చేసుకుని ఆన్‌లైన్ దర్శనం చూపించిన వారికి వారు కోరిన గది ఇవ్వాలని, ఒకవేళ ఫిర్యాదు అందితే సస్పెన్షన్‌కు వెనుకాడబోనని హెచ్చరించినట్లు సమాచారం. తిరుమలలో రూ.50 నుంచి 6వేల రూపాయల వరకూ గదులు వేలాదిగా ఉన్నాయి. రిసిప్షన్ డిప్యూటీ ఈవో 2 అధికారి చేతిలో ఏసీ గదులు ఎక్కువగా ఉంటాయి. విఐపిలు సైతం ఈ గదుల కోసమే పోటీ పడుతుంటారు. గదులు ఖాళీగా ఉన్నప్పటికీ అధికారులు తమకు కావాల్సిన వారికి దర్శనం చేయించడంలో నిమగ్నమయ్యారే తప్ప, వసతి కోసం భక్తుల ఇబ్బందులను పట్టించుకోలేదని తెలుస్తోంది. ఇకనైనా టిటిడి ఉన్నతాధికారులు ఖాళీ గదులను అడిగిన వెంటనే ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.





అక్రమార్కుల చర్యలతో చెరువు కట్ట ఇలా...

ప్రమాదకరంగా చిందేపల్లి చెరువు కట్ట

ప్రజాశక్తి -ఏర్పేడు

ఏర్పేడు మండలం చిందేపల్లి పంచాయతీలో ఇంకా ఏమాత్రం వర్షం పడినా చెరువు పూర్తిగా నిండితే చెరువు కట్ట తెగిపోవడానికి సిద్ధంగా ఉంది. నాలుగు నెలల క్రితమే ట్రాక్టర్ల రాకపోకలకు వీలుగా చెరువు కట్టను జెసిబిలతో తవ్వి అక్రమంగా చెరువులోని మట్టిని తరలించడం వల్లే ఇలా జరుగుతుందని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ చెరువు ఆవరణలో సుమారు 500 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. అదేవిధంగా 250 మంది కుటుంబాలు జీవిస్తున్నాయి. ఒకవేళ ఈ చెరువు కట్ట తెగితే రైతులు, వందల కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉందని గ్రామస్తులు వ్యక్తం చేస్తున్నారు. అధికారుల స్పందించి సమస్యను పరిష్కరించాలని, అక్రమంగా మట్టిని తరలించిన వారి పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని కోరుచున్నారు.

రూ.87 లక్షల విలువైన మొబైల్ ఫోన్లు రికవరీ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ



తిరుపతి జిల్లా పోలీసులు నెల రోజులు వ్యవధిలో చోరీకి గురైన 87 లక్షల విలువ గల 435 మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్టు జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు తెలిపారు. తిరుపతి జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో సెల్ ఫోను పోగొట్టుకున్న వారి కోసం సిఈఐఆర్ ద్వారా తిరుపతి జిల్లా పోలీసు వారు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మొబైల్ హంట్ (వాట్సాప్ -9490617873) అప్లికేషన్ సేవల ద్వారా వచ్చిన ఫిర్యాదులపై ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా సెల్ ఫోన్ పోగొట్టుకున్న బాధితులకు 11 విడతలలో 3840 సెల్ ఫోన్ లను రికవరీ చేసి సెల్ ఫోన్ పోగొట్టుకున్న బాధితులకు అందించామన్నారు. సుమారు వీటి విలువ ఆ6 కోట్ల 69 లక్షల పైనే ఉంటుందన్నారు. ప్రస్తుతం 12వ విడతలో నెల రోజుల వ్యవధిలోనే 87 లక్షల రూపాయలు విలువ కలిగిన 435 మొబైల్ ఫోన్ల రికవరీ చేశామని వెల్లడించారు. అనంతరం బాధితులకు మొబైల్ ఫోన్లను అందజేశారు. సిఈఐఆర్‌లో ఫిర్యాదు చేసిన సెల్ ఫోన్‌ల రికవరీలో తిరుపతి జిల్లా రాష్ట్రం లో ప్రథమ స్థానంలో ఉందన్నారు. ఈ సందర్భంగా సెల్ ఫోన్ రికవరీలో ప్రతిభ కనబరిచిన సైబర్ క్రైమ్ సి.ఐ ఆర్.వినోద్ కుమార్, సైబర్ క్రైమ్ సిబ్బందిని జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు ప్రశంసా పత్రాలు అందజేసి, అభినందించినారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ యస్.పి వెంకటరావు, సైబర్ ల్యాబ్ సి.ఐ వినోద్ కుమార్ పాల్గొన్నారు.

మూన్నాళ్లకే ఇలా..

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



మరమ్మతులు చేసిన మూడు నెలలకే ఇలా..

పట్టణంలోని నాగాలమ్మ ఆలయం వద్ద శ్రీకాళహస్తి–పిచ్చాటూరు ఆర్ అండ్ బి రోడ్డులో కురిసిన భారీ వర్షాలకు పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఆ గుంతలకు ఆర్ అండ్ బి అధికారులు కంకర, క్రషర్ డస్ట్ వేసి మరమ్మత్తులు చేశారు. ఇది తమ ఘనతగా కూటమినేతలు చెప్పుకుంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు. గుంతలు పూడ్చి సరిగ్గా పది రోజులు కాకముందే మళ్లీ అదే ప్రాంతంలో భారీ గుంతలు ఏర్పడ్డాయి. వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాత్కాలిక మరమ్మత్తులతో సరిపెట్టకుండా శాశ్వత మరమ్మత్తులు చేపడితే ఫలితం ఉంటుందన్నది ప్రజల మాట. నాగాలమ్మ ఆలయం వద్దే కాకుండా బంగారమ్మ ఆలయం, తొట్టంబేడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద కూడా ఇదే తరహాలో గుంతలు పడగా అధికారులు తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టేశారు. అక్కడ కూడా మూన్నాళ్ళ ముచ్చటగా యధావిధిగా గుంతలు ఏర్పడ్డాయి.

వ్యర్థాల దారి..రోగాలకు రహదారి


ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వెళ్లే దారి వ్యర్థాలకు నిలయంగా మారింది. ఒక్క మాటలో చెప్పాలంటే మినీ డంపింగ్ కేంద్రంగా ఉంది. ఈ దారి పొడవునా చెత్తా చెదారంతో పాటు బయో వ్యర్థాలు పారేస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. నిత్యం ఈ దారి గుండా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి రోగులు, వారి బంధువులు రాకపోకలు సాగిస్తుంటారు. పాఠశాలలు, కాలేజీలు కూడా ఉండడంతో విద్యార్థులతో నిత్యం రద్దీగా ఉంటుంది. అంతేకాకుండా ఎస్టీకే నగర్, చెంచులక్ష్మి కాలనీలకు చేరుకోవాలంటే ఈ మార్గం గుండానే రాకపోకలు సాగించాల్సి ఉండడంతో బయో వ్యర్థాల దుర్వాసనలు భరించలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరీ ముఖ్యంగా ఏరియా ఆసుపత్రికి అతి సమీపంలో పెద్ద ఎత్తున బయో వ్యర్థాలు పడేస్తుండడంతో ఉన్న రోగాలకు బదులు కొత్త రోగాలొస్తాయేమోనని రోగులు, వారి బంధువులు ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు స్పందించి పెద్దాస్పత్రికి వెళ్లే దారిలో వ్యర్థాలు పడేయకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

ఆ రోడ్లో ప్రయాణం నరకయాతనే...

ప్రజాశక్తి - రామచంద్రాపురం



ఆ రోడ్డు ప్రయాణం నరకయాతనే.. ముసలీముతక అయితే నడుములు పోవాల్సిందే. నక్కలకోన, బొగ్గలకోన నుంచి వర్షపునీరు, ఊట నీరు కాల్వ ద్వారా ప్రవహించేది. అయితే నెత్తకుప్పం వద్ద అనుప్పల్లి–నెత్తకుప్పం ఆర్ అండ్‌బి రహదారిపై ఉన్న కల్వర్టు దగ్గర చెత్తాచెదారం, మట్టితో నిండిపోవడంతో రోడ్డు నీటికుంటలా తయారయ్యింది. వారం రోజులుగా అటువైపు ప్రయాణికులు వెళ్లేందుకు తంటాలు పడుతున్నారు. రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో తారురోడ్డు మొత్తం గుంతలుగా మారింది. ఈ మార్గంలో చంద్రగిరి, అనుప్పల్లి, వెదురుకుప్పం, తిరుపతి, పుత్తూరు ప్రాంతాలకు వాహనాల రాకపోకలు జరుగుతుంటాయి. గతంలో వరదనీరు వెళ్లేందుకు 20 అడుగులకు పైగా కాల్వ ఉండేది. ఆ కాల్వను గత వైసిపి నాయకులు కబ్జాచేసి, పక్కా భవనాలు నిర్మించారు. వరదనీరు పోవడానికి వీలు లేక రోడ్డుపైనే ప్రవహిస్తోంది. ఆర్ అండ్ బి అధికారులు స్పందించి వరదనీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.



రోడ్డుపైనే 'చికెన్' వ్యర్థాలు

ప్రజాశక్తి - ఏర్పేడు

మండల కేంద్రమైన ఏర్పేడులో చికెన్ షాప్ యజమానుల విచ్చలవిడితనం మితిమీరిపోతోంది. చికెన్ వ్యర్థాలు రోడ్లు మీదే వదేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో, దుర్గంధం భరించలేక స్థానికులు ముక్కులు మూసుకుంటున్నారు. ఏర్పేడు నుండి మూడు కిలోమీటర్ల లోపే ఇటు వెంకటగిరి, అటు శ్రీకాళహస్తి రోడ్ల మీదే చికెన్ వ్యర్థాలు నిత్యం దర్శనమిస్తున్నాయి. ఏర్పేడు బజార్ పక్కనే ఉన్న లెప్రసీ హాస్పిటల్ దగ్గరే ఈ వ్యర్థాలను పడేయడం వలన ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కుళ్లి దుర్గంధంగా మారి లెప్రసీలోని పేషెంట్లకు, రోడ్డుమీద ప్రయాణిస్తున్న ప్రయాణికులకు వాసన పీల్చలేక అవస్థలు పడుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి చికెన్ షాపు యజమానులు వ్యర్థాలు రోడ్లపై వేయకుండా, ప్రత్యామ్నాయ స్థలం చూపించాలని స్థానికులు కోరుతున్నారు.

పాఠశాలలో భద్రతా చర్యలు తప్పనిసరి : సిఐ

ప్రజాశక్తి- ఏర్పేడు

ఏర్పేడు మండలంలోని ప్రైవేటు పాఠశాలల మేనేజ్మెంట్లతో ఏర్పేడు సిఐ జయ చంద్ర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో యాజమాన్యం విద్యార్థుల కొరకు ఎలాంటి భద్రత చర్యలు చేపడుతున్నారని ఆరాతీశారు. పాఠశాలల యాజమాన్యంతో మాట్లాడుతూ పిల్లల పరిరక్షణ కోసం సీసీ కెమెరాలను పటిష్టంగా ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని, నిర్లక్ష్యం వహించరాదని ఆదేశించారు.

అంగన్వాడీ వర్కర్లకు ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ : ఎంపిడిఓ

ప్రజాశక్తి - పిచ్చాటూరు

పిచ్చాటూరు మండలంలోని ఐసిడిఎస్ కార్యాలయము నందు ప్రజా ప్రగతి ట్రస్ట్ ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్లకు ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ పై బుధవారం శిక్షణ ఇచ్చారు. ఎంపిడీఓ మహమ్మద్ రఫీ, శిశు సంక్షేమ శాఖ అధికారి శోభారాణి మాట్లాడుతూ ప్రజాప్రగతి ట్రస్టువారు క్వాలిటీ ఎడ్యుకేషన్ పైన, బాల్య వివాహాలపై విస్తృత ప్రచారం చేస్తున్నారన్నారు. కేవీబీ పురం మండల కోఆర్డినేటర్ వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రజా ప్రగతి ట్రస్ట్ చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు. ప్రజా ప్రగతి ట్రస్ట్ నుంచి రిసోర్స్ పర్సన్ సుబ్రహ్మణ్యం, చెంచురామిరెడ్డిలు భాషా ఆటలు, శబ్ద ఆటలు, పూర్వ గణితం, శాస్త్రీయ పరిజ్ఞానం మొదలగు కత్యాల పైన అంగన్వాడీ టీచర్లకు శిక్షణ ఇచ్చారు.

తుడా టవర్స్ నిర్మాణ పనులు పరిశీలన

తిరుపతి టౌన్ : తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) ఆధ్వర్యంలో రాయల చెరువు రోడ్డులో నిర్మిస్తున్న తుడా టవర్స్ నిర్మాణ పనులను తుడా ఉపాధ్యక్షులు, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పరిశీలించారు. అనంతరం తుడా కార్యాలయంలో అధికారులతో సమావేశమై సమీక్షించారు. తుడా టవర్స్ లో కల్పిస్తున్న వసతులు, ఇప్పటివరకు జరిగిన పనుల వివరాలను అధికారులు తెలిపారు. పనులు ఆలస్యం అవుతున్నాయని, త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఫిబ్రవరిలో వేలం నిర్వహించేలా జనవరి నెలాఖరులోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సెక్రటరీ వెంకటనారాయణ, సూపరింటెండెంట్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్ర, డి.ఈ.భాషా, ఏ.ఈ.షణ్ముగం, కె.పి.సి సంస్థ ఈ.డి.సుశీల్ కుమార్ ఉన్నారు.

శ్రీ లక్ష్మీనారాయణ స్వామి సేవలో వీరేంద్ర సెహ్వాగ్

రామచంద్రాపురం : మండలంలోని సి రామాపురం సమీపంలో ఉన్న శ్రీ సిద్దేశ్వర తీర్థం బ్రహ్మర్షి గురూజీ ఆశ్రమంలోని శ్రీ లక్ష్మి నారాయణ స్వామి సేవలో భారత్ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం ఉదయం బ్రహ్మర్షి గురూజీ ఆశ్రమానికి విచ్చేసిన క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్కు ఆశ్రమ నిర్వాహకులు రాజేష్, రాంప్రకాష్, ప్రకాష్ సేటియాలు అర్చకులచే పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆశ్రమ పీఠాధిపతి బ్రహ్మర్షి గురూజీ ఆశీర్వాదం తీసుకున్నారు. ఆశ్రమ నిర్వాహకులు భారత్ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ను దుశ్శాలువతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అన్నదానానికి రూ.25 వేల సాయం

ప్రజాశక్తి- ఏర్పేడు

మండలంలో ప్రసిద్ధిగాంచిన గుడిమల్లం ఆలయంలో జరిగే అన్నదాన కార్యక్రమానికి కొండేపి జిల్లా పసలపూడి గ్రామానికి చెందిన చిన్నం సత్తిరెడ్డి 25వేల రూపాయలు నగదు ఆలయ చైర్మన్ బత్తల గిరిబాబు నాయుడు, ఈవో రామచంద్ర రెడ్డి లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆతనికి కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీసిటీ-ఇసుజు ప్లాంట్ 'లక్ష'వ వాహనం విడుదల

ప్రజాశక్తి - వరదయ్యపాలెం

శ్రీసిటీలోని ఇసుజు మోటార్స్ ఇండియా పరిశ్రమ (ఐఎంఐ) తమ ప్లాంట్ లో తయారైన లక్షవ వాహనాన్ని విడుదల చేసింది. బుధవారం పరిశ్రమ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు వాణిజ్య శాఖ కార్యదర్శి డాక్టర్ ఎన్.యువరాజ్ చేతుల మీదుగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, పిహెచ్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్, శ్రీసిటీ జపనీస్ కన్సెర్జ్ గ్రూప్ చైర్మన్ సాదో గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. ఇసుజు ఇంజినీరింగ్ బిజినెస్ సెంటర్ ఇండియా చైర్మన్ సూమోటో మాట్లాడుతూ ఐఎంఐ వద్ధి ప్రయాణాన్ని వివరించారు.

'టీకే' సమ్మేళనంలో రాజేంద్రుడు

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి

మైసూరు విశ్వవిద్యాలయంలో జరుగుతున్న తెలుగు-కన్నడ భాషల సమ్మేళనంలో తిరుపతి, చిత్తూరు జిల్లాల తరపున స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు సంక్రాంతి రాజేంద్రుడు పాల్గొన్నారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని రాజేంద్రుడు ఆ సభలో సూక్తుల సామెతల ద్వారా వెల్లడించారు. ఈ సందర్భంగా రాజేంద్రుడును కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నరసింహ వర్మ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ గంగారాం అభినందనలు తెలియజేశారు.

రుయాలో ఓపీకి వచ్చి...

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

రుయా ఆసుపత్రిలో అపస్మారక స్థితిలో ఉన్న ఓ వ్యక్తికి వైద్యులు అత్యవసర వైద్యం అందించారు. పోలీసుల వివరాల మేరకు.. తిరుపతి రుయా ఆసుపత్రిలో వైద్యం తీసుకునేందుకు గుర్తు తెలియని 35 సంవత్సరాల వయసు ఉన్న వ్యక్తి బుధవారం ఉదయం ఓపి విభాగానికి వచ్చాడు. ఓపీ వద్ద ఒక్కసారిగా పడిపోవడంతో తలకు తీవ్ర గాయమయ్యింది. అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు. అక్కడి సిబ్బంది దీన్ని గుర్తించి వైద్యులకు సమాచారం అందించి హుటాహుటిన ఆపరేషన్ థియేటరు తరలించి వైద్యం అందించారు. ఆ వ్యక్తి వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో వైద్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకున్నారు. గాయపడిన వ్యక్తి వివరాలు తెలిసినవారు వెస్ట్ పోలీసు స్టేషన్లో సంప్రదించాలని సూచించారు.

నడవలూరులో డెంగీ జ్వరాలు

ప్రజాశక్తి - రామచంద్రాపురం

వరుస తుపాన్లు, దోమల బెడద, వాతావరణంలో మార్పులు కారణంగా మండలంలోని నడలూరు గ్రామంలో డెంగ్యూ జ్వరాలతో ప్రజలు విలవిల లాడుతున్నారు. గత 15 రోజులుగా గ్రామంలో విష జ్వరాలతో జనం మంచం దిగే పరిస్థితి లేదు. స్థానిక సర్పంచ్ గణపతి రెడ్డి మురికినీటి కాలువల శుభ్రం చేయించి, దోమల నివారణ కోసం ఫాగింగ్, తాగునీరు క్లోరినేషన్, బ్లీచింగ్ పిచికారి చేయించి పారిశుధ్యాని మెరుగుపరిచారు. కమ్మపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ జావిద్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందించి, ఔషధాలు కూడా పంపిణీ చేశారు. అయినా విషజ్వరాలు నియంత్రణ కాకపోవడం గమనార్హం. ప్రతి ఇంట్లో ఇద్దరు ముగ్గురు జ్వరాల బారిన పడి మంచాలపై మగ్గుతున్నారు. సూరావారిపల్లి గ్రామంలోనూ జ్వరాలు రావడంతో కుప్పంబాదూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకున్నారు.



జ్వరపీడితురాలు

దివ్యారామాన్ని అభివృద్ధి చేయండి : ఎంఎల్ఎ



రుయాలో ఎంఎల్ఎ తనిఖీలు

తిరుపతి టౌన్ : దివ్యారామాన్ని అభివృద్ధి చేయాలని డిఎఫ్ఒ వివేక్ను బుధవారం ఉదయం మర్యాదపూర్వకంగా కలిసి ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు సూచించారు. నడక సమయాన్ని అరగంట పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్లో ఉన్న తిమ్మినాయుడుపాలెం గ్రామస్తుల స్మశాన సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం అటవీ భూమికి ప్రత్యామ్నాయంగా భూమి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అలాగే కపిలీర్థం ఆలయ ఆవరణలో పిండ ప్రదానం చేసుకునేందుకు పార్కింగ్స్థలాన్ని వినియోగించుకునేందుకు అనుమతించాలని కోరారు.

ఆటో మోటార్ వాహనాలపై పెండింగ్లో ఉన్న ఆర్టీవో పోలీసు ఈ చలానాలను తక్షణమే రద్దు చేయాలని, ప్రతి ఆటో కార్మికునికి బ్యాంకుల ద్వారా రుణాలను మంజూరు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి కె.రాధాక్రిష్ణ డిమాండ్చేశారు. బుధవారం రుయా ఆస్పత్రి వద్ద ఉన్న ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులును ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రాలు ఇచ్చారు.

రుయా అభివద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి

తిరుపతి సిటీ : ఉప్పరపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని బుధవారం ఉదయం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పరామర్శించారు. వారికి అందిస్తున్న చికిత్స వివరాలను సూపరిండెంట్ రవి ప్రభును అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం క్షతగాత్రులకు అందించాలని సూపరిండెంట్ ను ఎమ్మెల్యే ఆదేశించారు. క్షతగాత్రులను పరామర్శించే సమయంలో ఆసుపత్రి పై పెచ్చులు ఊడటాన్ని పరిశీలించారు. ఆస్పత్రిలోని ఏ ఏ భవంతుల్లో పెచ్చులు ఊడయో వాటి మరమ్మతుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయన సూపరిండెంట్ ను ఆదేశించారు. త్వరలో జరిగే హెచ్ డి ఎస్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎం ఓ హరికిరణ్, వైద్యులు, జనసేన నగర అధ్యక్షులు రాజారెడ్డి, బాబ్జీ, సుధాకర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

అద్దె బస్సులు వద్దు : ఎన్ఎంయు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఆర్టీసీ సర్వతోముఖాభివృద్ధి సాధించాలన్నా.. ప్రజా రవాణా సౌకర్యాలు మెరుగుపడాలన్నా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అద్దె బస్సుల స్థానంలో కొత్త బస్సులు ఏర్పాటు చేయాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ తిరుపతి జిల్లా కార్యదర్శి బీఎస్ బాబు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో ఎన్ఎంయు సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన విఎస్ బాబు మాట్లాడుతూ ఏపీఎస్ఆర్టీసీలో ఓల్డ్ పెన్షన్ విధానం లేకపోవడం వల్ల ఉద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. పెన్షన్ విధానం లేని విలీనాన్ని తాము ఒప్పుకుని ఉండే వాళ్ళం కాదని చెప్పారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని అమలు చేయడానికి ముందే అద్దె బస్సుల స్థానంలో కొత్త బస్సులు ఏర్పాటు చేయాలనీ, ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. తద్వారా ఆర్టీసీ పురోగతి సాధించడంతో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు దక్కే వీలంటుందని తెలియజేశారు. శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో పరిధిలో పెద్ద సంఖ్యలో అద్దె బస్సులు నడుపుతున్నారనీ, ఇది ఎంత మాత్రమూ డిపో అభివద్ధికి, ఉద్యోగుల సంక్షేమానికి దోహద పడదని స్పష్టం చేశారు. వెంటనే ఈ విధానానికి స్వస్తి పలికి బస్టాండ్ లో మౌలిక వసతుల మెరుగుకు చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్ర కార్యదర్శి చెంచులయ్య, జిల్లా అధ్యక్షులు పెరుమాల్, ఉపాధ్యక్షులు గుణశేఖర్, డిపో చైర్మన్ సాధిక్ పాల్గొన్నారు.

పోలీస్ సేవలు ఇకపై సులభతరం : ఎస్పి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

జిల్లాలో పోలీస్ సేవలను సులభతరం చేసేందుకు తిరుపతి జిల్లా పోలీస్ శాఖ వెబ్సైట్ సేవలను ఎస్పీ సుబ్బారాయుడు బుధవారం ప్రారంభించారు. తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో ఆధునికరించిన కొత్త పోలీస్ వెబ్ సైట్ ను ప్రారంభించిన జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల సౌలభ్యం కోసం, సిటిజన్ ఫ్రెండ్లీ వెబ్సైట్ను ప్రారంభించాము. ఈ వెబ్సైట్ పారదర్శకత, జవాబుదారీతనం, ప్రజా సేవలకోసం మెరుగైన ఫలితాలు అందించే దిశగా అడుగు ముందుకు వేసాం అన్నారు. ఎన్ ఐసి (నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్) సహకారంతో తిరుపతి జిల్లా పోలీసులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని పోలీసులు వెబ్ సైట్ లో ఉంచామని తెలిపారు. ప్రజలకు మరింత దగ్గరగా అవ్వడానికి, పోలీస్ సేవలను ప్రజలు తెలుసుకోవడానికి, ఈ పోలీస్ వెబ్ సైట్ ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ యస్.పి వెంకటరావు, యన్.వెంకటేశ్వర్ రావు, జాయింట్ డైరెక్టర్ (ఐ.టి), బి.కే సుధాకర్ డిస్ట్రిక్ట్ ఇంఫోర్మటిక్ ఆఫీసర్ పాల్గొన్నారు.

లక్ష్యాల స్థానికీకరణపై అవగాహన తప్పనిసరి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - కోట, నాయుడుపేట

ప్రతిఒక్కరూ స్థిరమైన అభివృద్ధి, లక్ష్యాల స్థానికీకరణపై అవగాహన తప్పకుండా కలిగి ఉండాలని ఎంపిడిఒ వై.వేణు అన్నారు. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ ద్వారా లోకలైజేషన్ ఆఫ్ సస్టైనబుల్ డెవలప్మెంట్ గోల్స్ (ఎల్ఎస్డిజి) పై ఎంఇఒ దారా మస్తానయ్య, అంగన్వాడి సూపర్వైజర్తో కలిసి సర్పంచులకు, ఎంపిటిసిలకు, కార్యదర్శులకు, సచివాలయ ఉద్యోగులకు మగళ, బుధవారాల్లో శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎంపిడిఒ వై.వేణు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి కార్యక్రమంలో చురుగ్గా పనిచేస్తూ కర్తవ్యాలను సక్రమంగా నిర్వర్తించుకోవాలన్నారు. ఎపిఒ పూర్ణిమ, అంగన్వాడి సూపర్వైజర్లు కవిత, కృష్ణమ్మ పాల్గొన్నారు.



నాయుడుపేటలో... ఎపిఎస్ఐఆర్టి రాష్ట్ర ప రిశీలకులు ఎ.రమేష్ ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం జరిగింది. ప్రతి పిల్లవానికి విద్యతో పాటు, పౌష్టికాహారం, వైద్యం అందేలా కృషి చేయాలని, గ్రామాల్లో పారిశుధ్యాన్ని, పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు.

ప్రజాశక్తి - రామచంద్రాపురం

దేశానికి పట్టుకొమ్మలైన గ్రామ పంచాయతీలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయడానికి కృషి చేయాలని డిఎల్పిఒ సురేష్నాయుడు అన్నారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచి, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ ద్వారా రెండో రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపిడిఒ ఇందిర మాట్లాడుతూ పంచాయతీల్లో నిధులు దుర్వినియోగం కాకుండా గ్రామసభలు ఏర్పాటు చేసి, అభివృద్ధి పనులు గుర్తించి పనులు చేపట్టాలన్నారు. ఇన్ఛార్జి ఇఒపిఆర్డి చంద్రశేఖర్రెడ్డి, విద్యాశాఖ అధికారి మార్కండేయనాయుడు, వెలుగు ఎపిఎం గురుమూర్తి పాల్గొన్నారు.

కేంద్రమంత్రిని కలిసిన దశరథాచారి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి కేంద్ర విమానయాన శాఖా మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడును టిడిపి రాష్ట్ర కార్యదర్శి గుమ్మడిపూడి దశరథచారి న్యూఢిల్లీలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలంకారి కండువాను కప్పి కొయ్య వినాయకుని విగ్రహాన్ని బహుకరించారు. అనంతరం జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. రేణిగుంట ఎయిర్పోర్టులోని దుకాణ సముదాయాల్లో భారత హస్తకళలు, చేనేత, ఖాదీ, గ్రామీణ పరిశ్రమల ఉత్పత్తుల కళాకారులను ప్రోత్సహించి వారికి ఆ వాణిజ్య సముదాయాల్లో తమ ఉత్పత్తులను ప్రదర్శించే విధంగా అవకాశం కల్పించవలసిందిగా కేంద్రమంత్రిని దశరథచారి కోరారు.

సిమెంట్ రోడ్డు నిర్మాణాలు వేగవంతం చేయాలి : పీడీ

ప్రజాశక్తి- ఏర్పేడు

మండలంలోని పాతవీరాపురం పంచాయతీలో సిమెంట్ రోడ్డు నిర్మాణ పురోగతిని పీడీ శ్రీనివాస్ ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిమెంట్ రోడ్డు పని చేపడుతున్న వెండార్ రవితో మాట్లాడుతూ రోడ్డుపని నాణ్యతగా చేపట్టి, ఎక్కువ కాలం మన్నికగా ఉండేటట్లు నిర్మించాలని దిశా నిర్దేశం చేశారు. రోడ్డు పనులు పూర్తయిన వారం రోజుల లోపే మెటీరియల్ పేమెంట్ బిల్లును త్వరగా క్రెడిట్ అవుతుందని, పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. రోడ్ల నిర్మాణాలలో నిర్లక్ష్యం వహిస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీరాజ్ ఇంజినీర్ రవితేజ, అదనపు కార్యక్రమాధికారి అవిలాల దేవేరిలతో మాట్లాడారు. మండలంలో మొత్తం 35 పనులకు రూ.1.70 కోట్లకు రెండునెలల క్రితం పనులు శాంక్షన్ చేశామని, కేవలం మూడు పనులు మాత్రమే చేశారన్నారు. 32 సిమెంట్ రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయకుండా నిర్లక్ష్యం వహించడం సబబు కాదన్నారు.



రహదారి నిర్మాణ పనులు తనిఖీ

ఈవీఎం గోడౌన్లలో పటిష్ట భద్రత : కలెక్టర్

తిరుపతి టౌన్ : జిల్లాకు సంబంధించి ఈవీఎంలను భద్రపరిచిన గోదాము వద్ద నిరంతరం పటిష్టమైన నిఘా, భద్రత ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మార్గదర్శకాలు ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా తిరుపతి జిల్లా రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని సెంట్రల్ వేర్ హౌసింగ్ గోడౌన్ నందు భద్ర పరచబడిన ఈవీఎం గోదామును బుధవారం రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. ఎన్నికల రోజున పోలింగ్ సమయంలో సక్రమంగా పని చేయని 66 ఈవీఎం లను గోడౌన్ లో ఉంచిన వాటిని బెల్ కంపెనీకి భద్రత నడుమ పంపాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, ఆర్డీవో శ్రీకాళహస్తి భాను ప్రకాష్ రెడ్డి, ఈవిఎం గోడౌన్ ఇంఛార్జి సుధారాణి, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ప్రసాద్, రేణిగుంట తాసిల్దార్ సురేష్ పాల్గొన్నారు. అనంతరం రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని అండర్ గ్రౌండ్ పవర్ కేబుల్ లైన్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

వేద విద్య వ్యాప్తికి టిటిడి కృషి : ఈవో

తిరుపతి సిటీ : వేద విద్య వ్యాప్తికి, వేద పరిరక్షణకు టీటీడీ విశేష కషి చేస్తోందని ఈవో జె.శ్యామలరావు అన్నారు. తిరుపతిలోని ఎస్వీ వేద విశ్వవిద్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించి విశ్వవిద్యాలయ కార్యాకలాపాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎస్వీ వేద విశ్వవిద్యాలయాన్ని టీటీడీ 2006లో ప్రారంభించిందన్నారు. అప్పటి నుండి వేద విద్యలో ఉన్నతస్థాయి పరిశోధనలు జరిగాయన్నారు. వేద పరిశోధనలో భాగంగా వేదాల్లో ఉన్న విజ్ఞానాన్ని బయటకు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఐఐటీ సహకారంతో ప్రాచీన భారతీయ శాస్త్రాల్లో ఉన్న విజ్ఞానాన్ని నేటి యువతకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరంవిద్యార్థుల తరగతి గదులు, హాస్టళ్లు, రికార్డింగ్ స్టూడియో, తాళపత్ర గ్రంథాలు పరిశీలించారు. ఎస్వీ వేద విశ్వ విద్యాలయం వీసీ రాణి సదాశివమూర్తి, టీటీడీ జేఈవో గౌతమి, రిజిస్ట్రార్ ఆచార్య డాక్టర్ రాధాగోవింద త్రిపాఠి పాల్గొన్నారు.

తిరుచానూరులో కియోస్క్ మిషన్ ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుచానూరు అన్నదానం కాంప్లెక్స్లో మంగళవారం టీటీడీ జేఈవో వీరబ్రహ్మం సెల్ఫ్ సర్వీస్ కియోస్క్ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మెషిన్ భక్తుల నుండి రూ.లక్ష వరకు విరాళాలను స్వీకరిస్తుందన్నారు. కెనరా బ్యాంక్ ఈ కియోస్క్ మిషన్ను విరాళంగా ఇచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జీఎం (ఐటీ) వెంకటేశ్వర్లు నాయుడు, అన్నప్రసాదం సూపరింటెండెంట్ ఉష తదితరులు పాల్గొన్నారు.

దేవేంద్ర కుటుంబాన్ని పరామర్శించిన ఆర్కెరోజా

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

తడుకు మాజీ సర్పంచి, వైసిపి సీనియర్ నాయకులు బాలాజీ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు.అలాగే గొల్లపల్లి వైసిపి నాయకులు దేవేంద్ర తల్లి పెద్ద నారాయణమ్మ మృతిచెందారు. వీరి కుటుంబాలను మాజీ మంత్రి ఆర్కె రోజా బుధవారం పరామర్శించారు. గొల్లపల్లి సర్పంచి విరిత, వైసిపి వైస్ ఎంపిపి మునస్వామిరెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ ఎ.హరి పాల్గొన్నారు.

క్రైం న్యూస్

పట్టపగలే మహిళను మెడలో గొలుసు చోరీ

తిరుపతి సిటీ: పట్ట పగలే గుర్తుతెలియని వ్యక్తులు ఓ ఇంట్లోకి చొరబడి కంటిలో కారం కొట్టి మహిళ మెడలో గొలుసు చోరీ చేసిన ఘటన బుధవారం తిరుపతిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు అవిలాల పరిధిలోని వాణినగర్లో నాగ స్వాతి నివాసం ఉంటుంది. బుధవారం ఉదయం ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఇంటిలోకి చొరబడి, స్వాతి కళ్ళల్లో కారం కొట్టి, ఆమె మెడలోని బంగారు చైను దోచుకెళ్లారు. బాధితురాలు గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని బాధితురాలి అడిగి వివరాలు సేకరించారు, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, సీసీ పుటేజ్ ల ఆధారంగా దొంగలను గుర్తించేందుకు దర్యాప్తు వేగవంతం చేశారు.

ఏడు స్పోర్ట్స్ బైక్లు స్వాధీనం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : తిరుపతి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, తిరుపతి టౌన్ డి.యస్.పి జె.వెంకటనారాయణ ఆధ్వర్యంలో యస్.వి.యు క్యాంపస్ సి.ఐ యం. రామయ్య సిబ్బందితో కలిసి తిరుపతి టౌన్ పరిధిలోని యస్.వి.యు, అలిపిరి పి.యస్ పరిధి ప్రాంతాల్లో, ఫ్లై ఓవర్ రోడ్లు, జూపార్క్ రోడ్డుల్లో స్పోర్ట్స్ బైక్లతో రేసులు నిర్వహించేవారిపై, ప్రమాదకర విన్యాసాలు చేస్తూ వీడియోలు ఇంస్టాగ్రామ్ , వాట్సాప్ లలో పోస్టు చేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంచి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా ఏడు బైక్ లను స్వాధీనం చేసుకొని సంబంధిత వ్యక్తులకు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి, కేసులు నమోదు చేసి ఆర్ టీఓకు నివేదించారు.

అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండల కేంద్రంలోని సాయిబాబా గుడి సమీపంలో ఓ ఆటోలో నిల్వ ఉంచిన 700 కిలోల రేషన్ బియ్యాన్ని బుధవారం టూ టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యాన్ని పేదల నుంచి సేకరిస్తున్న సహదేవ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. శ్రీకాళహస్తి పట్టణంలో బాలాజీ అనే వ్యక్తి సహకారంతో గ్రామీణ ప్రాంతాల నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి, పట్టణంలో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు నిందితుడు తెలిపాడు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటేశులు తెలిపారు.

జిల్లాలో ఇద్దరు కానిస్టేబుళ్లు సస్పెండ్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి జిల్లాలో విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు బుధవారం ఆదేశాలు జారీ చేశారు. కానిస్టేబుల్ జి.చంద్రయ్య (పిసి 3586) నాయుడుపేట పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్నారు. ఈయన క్రమశిక్షణ లోపించి ప్రజల వద్ద దురుసుగా ప్రవర్తించడంతో పాటు జవాబుదారితనం, లోపించి విధులు నిర్వహిస్తుడంతో క్రమశిక్షణా చర్యలలో భాగంగా సస్పెండ్ చేశారు. అలాగే తిరుపతిలో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న బి. రవికుమార్ కూడా క్రమశిక్షణ లోపించి, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు రావడంతో ఇతనిని కూడా క్రమశిక్షణా చర్యలలో భాగంగా జిల్లా ఎస్పీ సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

21 నుంచి 'లా' కోర్సు స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం న్యాయ విభాగం నిర్వహించే కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 21 నుండి 27 వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఎపి లా సెట్ -2024, ఎపి పిజి ఎల్ సెట్ -2024 ఉత్తీర్ణులైన విద్యార్థినులు దీనికి అర్హులు అని విభాగాధిపతి మాధురి పరదేశి ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల, ఐదేళ్ల డిగ్రీ కోర్సులు, రెండేళ్ల పిజి కోర్సుల్లో ప్రవేశానికి అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టనున్నారు.